కల్మషాలన్నిటినీ అడుక్కి నెట్టేసి, కలవారి తల్లిలా ప్రశాంతంగా, నిండుగా ప్రవహిస్తున్న గోదావరి, పంటకాలవలో ప్రవేశించగానే సంపదలు పోగొట్టుకున్న సాధ్వీ మతల్లిలా ఒదిగి ఒదిగి సాగిపోసాగింది.

కాలువలో నిలబడి బండమీద బట్టలు బాదుతున్నాడు తాతాలు. ఇంటి ముందున్న వర మామిడి చెట్టు గొడుగు పట్టింది. ప్రక్కనున్న పంటచేను వింజామరలు వీస్తున్నది. గట్టు మీదున్న పట్టపురాణి వుతికిన బట్టలను గంజిలో ముంచి ఆరవేస్తున్నది. యువరాజు– సుబ్బరాజుగారి బట్టల మూటెక్కి ఆడుకుంటున్నాడు.

# అమ్మంటే....

## బండారు లక్ష్మి

"రాత్రికి కోక్కట్టుకోయే రవణా సినేమా కెల్దాం! దీనెమ్మ ఈ కోక్కట్టుకుంటేనే నువ్వు రంబకి సాయానా సిన్నమ్మ కూతుర్లా గుంటావ్"– అన్నాడు తాతాలు చింత పిక్కరంగు సిల్కు చీర కాలవలో జాడిస్తూ.

పాలిస్టర్ చీరతాడుకేస్తున్న రవణ అతగాడికేసి చూసి కిసుక్కున నవ్వింది. దాన్నవ్వు చూస్తే తాతాలుకి తను ఈ మధ్యన చూసిన సినిమాలోని హీరోయిన్ జ్ఞాపకం వచ్చింది.

1983 ఉగాది కథల పోటీలో మొదటి బహుమతి రు. 1500/– పొందిన కథ

'ఆవిడ పేరేటోగాని ఆయమ్మకింకా వొళ్ళుంది బొందలాగ.రవణలాగ సవ్వరగా లేదు.' అనుకున్నాడు.

ఎర్రకోక ఎగ్గట్టి ఎగబాకిరిపోతున్న రైకతో బట్టలారబెడుతున్న రవణ్ణి చూసి— "దీని చెవులకి ఎర్రరాళ్ళ దుద్దులు చేయించుతే బాగుణ్ణు దానిమ్మపంసులాగ మెరిసపోను" అనుకున్నాడు. బట్టలు బాదుతూ అలా ఎన్నో అనుకుంటాడు తాతాలు. ఒకోసారి అనుకున్నవి రవణతో కూడా చెప్పేస్తాడు.



"సాల్లే కబుర్లు.సాకిరేవు బల్లకాడూసులు యిప్పుడు బల్లదాకా వుంటే...."

"వుంటే ఏటిత్తావే? బూర్లొండెడతావా?"

"మరే. బూర్లొండెడితావా పెళ్ళవా అంటే వుండుమీదకి నూన్లేచందట నాలాటిదెవర్తో. మనకి బూర్లుకిలో ఉటి ఎవరొండుకుంటే ఆళ్ళే ఎడతాయిగానీ—ఏటి మాయ్యా రాయుడుగారిల్లలాగ ముస్తాబు సేత్తున్నారేటి? ఎవరికైనా పెళ్ళంటావా?" సీలిమందులో తెల్ల కోక ముంచుతూ అడిగింది రవణ.

"నీకు బూర్లు కావాలని ఆళ్ళని పెళ్ళిళ్ళు చెయ్యమంటావేటే— దీనెమ్మ— ఎవరో ఆఫీసరుగారంట. ఆయనమ్మగారికి వొళ్ళు బాగోడానికి వొరిగాలి కావాలంట. ఆయమ్మ రెండ్రోజుల్లో వొత్తారంట. అందుకని ఆ మేడ నలాగ ముస్తాబు చేత్తన్నారు.రాజు తల్సుకుంటే దెబ్బలక్కొదవా?"

"అంతేలే. ఇంటిమీద కమ్మ తిరగేయించాలని నిరుణ్ణించి మల్లగుల్లాలడిపోతున్నాం. అయిందా? సినుకులొత్తే చాలు ఇల్లంతా వరదే. ఇంటిల్లపాదీ రెక్కలు ముక్కలు చేసుకుంటే మాత్రం ఏటొన్నబం? ఏ పూట బత్తెం ఆ పూటకే" విలవిల్లాడింది రవణ మనసు.

"సాకలోడి సంపాదన పందాలకై పోవా

లచే– యింటమ్మతల్లి శాపం" అన్నాడు తాతాలు చొక్కాకి సబ్బురాస్తూ.

"ఊ– నీతోసాయంగా వొచ్చి చెప్పింది యింటెమ్మతల్లి." విసుక్కుంది రవణ.

"ఏటేయ్...." పెళ్ళంమీద కళ్ళెర్ర జేయబోయాడు తాతాలు.... మునసబుగారి పాలేరు బట్లకోసం కేకెయ్యడంతో అటు తిరిగిపోయాడు.

* * *

మధ్యాహ్నం నిద్ర పూర్తిచేసి టీ త్రాగుతూ కూర్చుంది సులభ. కిటికీలో నుంచి వస్తున్న పైరగాలి రేవులో బట్టల చప్పుణ్ణి తీసుకొస్తోంది. సులభ వాచీచూసుకుంది. మూడవుతోంది. తెల్లవారి ఐదుగంటల నుంచి విసుగూ విరామం లేకుండా వుతుకుతున్నాడు బట్టలు. అతని పెళ్ళమూ-పెద్దపిల్లా వుతికినవిఆరేస్తూ-ఆరినవి మడతలేస్తూ క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నారు. రెండోపిల్ల బొగ్గులు తెచ్చింది. మూడోపిల్ల చంటివాణ్ణి ఎత్తుకొని ఆడిస్తోంది.

సులభ రవణవైపు కుతూహలంగాచూస్తూ కూర్చుంది. రవణని చూస్తుంటే ఎవరో బాగా తెలిసున్న మనిషిలాగా– పరిచయమయిన వ్యక్తి లాగా అనిపిస్తోంది. రవణను పోలిన మనిషి ఎవరైనా తెలుసా—?

జ్ఞాపకాల పుటల్లో ఒక్కో కాగితం ఎగురుతోంది కానీ తనకు కావలసిన ఫొటో దొరకడంలేదు. స్వప్న అత్తవారి తరపున ఎవరైనానా– జ్ఞాపకాల టెలివిజన్‌లో–

* * *

"మమ్మీ నా ఫ్రెండ్ రమేష్ చంద్ర"

అతను వినయంగా నమస్కారంచేశాడు.

సులభ తల ఊపి "గ్లాడ్ టు మీ ట్యూ" అంది.

అతని చెయ్యి పట్టుకొని లాగి సోఫాలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుంది స్వప్న.

సులభ పాదాలక్రింద వున్న ఖరీదైన కార్పెట్ వైపు చూస్తూ కూర్చున్న అతడిని పరిశీలనగా చూసి ఇతడు రమేష్‌చంద్ర కాదు రామారావే అనుకుంది సులభ.

ఇతన్లో ఏదో వెరైటీ కనిపించింది స్వప్నకు. అదే ప్రేమ అనుకుని రోమియో అండ్ జూలియట్ ని కంఠతా పడుతోంది.

కృష్ణశాస్త్రి గేయంతో రాకెన్‌రోల్ చేయలేరు స్వప్నా అని చెప్పినా అర్థం చేసుకునేలా లేదు. వాళ్ళ నైతిక విలువలు వేరు, మన నాగరికత వేరు అని చెప్పినా తల కెక్కించుకొనే స్థితిలో లేదు. కాని ఎక్కించాలి.

"రేపు మనింట్లో డిన్నరుంది తప్పకుండా రండి" అంటూ ఆహ్వానించింది సులభ.

"షూర్‌గా రావాలి. వస్తావుకదూ" అతని భుజం పట్టుకుని కుదిపి మరీ అడిగింది స్వప్న. అమ్మ ఓ కె. అన్నందుకు వుత్సాహంగా.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక "రాజకమల్స్"కి ఫోన్ చేసింది సులభ దినేష్ కోసం. అతడు రాజకమల్స్ సూటింగ్స్‌కి మోడలింగ్ చేస్తుంటాడు. మర్నాడు రాత్రి విందుకి రమ్మని మరీ మరీ ఆహ్వానించింది. సులభ అతగాణ్ణి పనివుందని చెప్పి.

ఎనిమిదయ్యే సరికి అతిథులందరూ హాజరయ్యారు.

"శంకర్ మొన్నకొన్ని టైలుతీసుకొచ్చాడు నీకు బావున్నవి సెలక్ట్ చేసుకో. చూడూ ఈవేళ స్వప్నతో కొంచెం క్లోజ్‌గా వుండు. తనెందుకో డల్‌గా వుంది" అంది సులభ నీట్‌గా ఫుల్ సూట్‌లో వచ్చిన దినేష్‌తో.

"షూర్, షూర్ నేనుండగా డల్ నెస్సా" అని హుషారుగా వెళ్ళి "హాయ్‌స్వప్నా-మై డ్రీం ఏంజిల్...." అంటూ ప్రక్కన కూర్చొని కబుర్లు మొదలుపెట్టాడు.

కాసేపయ్యాక అతిధుల మధ్యలోనించి ఎరేంజ్‌మెంట్స్ చూడ్డానికి వెళ్తూ క్రీగంట చూసింది సులభ.

స్వప్న దినేష్ కబుర్లకు పడిపడి నవ్వుతోంది పడిపోయిన పైట ను గమనించకుండా. దినేష్ ఆమెను మిఠాయిలా చూస్తుంటే రామూ మొహం బూందీలా మాడిపోయి వుంది.

నాలుగు రోజుల తరువాత నాలుగు వాజులూ అయిదు గ్లాసులూ ఆమె కోపానికి బలయ్యాక స్వప్న తల్లిదగ్గరకొచ్చి-

"నేనా రాస్కెల్‌ను చేసుకోను" అంది విసురుగా.

"ఏం స్వప్నా ఎందుచేత? హి ఈజ్ రియల్లీ ఎ గుడ్ గయ్" అంది సులభ చాలా కామ్‌గా.

"కాదు మమ్మీ. అతను చాలా మీన్‌గా ఆలోచిస్తాడు. ఆ రోజు నేను దినేష్‌తో క్లోజ్‌గా వున్నానని అసూయ. కుళ్ళు. అతనికటువంటివి నచ్చవట– నేను-ఆ రాస్కెల్ కాళ్ళునొక్కుతూ కూర్చోవాలట-ఇడియట్. ఐ హేట్ హిమ్! ఈ మిడిల్ క్లాస్ ఫూల్స్‌కి పెళ్ళమంటే బానిస షీర్ సర్వెంట్ మెయిడ్" అంటూ ఛీత్కారం చేసింది స్వప్న.

'అదే నేను చెప్తే తిరగేసి లైలామజ్నూ కథలన్నీ వల్లించును! అందుకే అన్నారు ఏ స్క్రూని ఆ డ్రైవర్‌తోనే త్రిప్పాల' ని అనుకుంది సులభ.

ఆ తరువాత చాలా ధనవంతులబ్బాయిని చూసి చాలా అట్టహాసంగా పెళ్ళి జరిపించారు స్వప్నకి. ఈ అట్టహాసం అట్టడుగున ఎక్కడో వుండిపోయాడు రామారావ్– స్వప్న ముద్దుగా పిలిచిన రమేష్‌చంద్ర. అతను ఎప్పుడూ టూర్లోనే వుంటాడు. వెళ్ళినప్పుడల్లా స్వప్నకి ఖరీదైన బహుమతులు తెస్తాడు. వూర్లో వున్నప్పుడిద్దరూ కలిసే పార్టీలకు వెళ్తుంటారు. అందుచేత వారిద్దరూ "మేడ్‌ఫర్ ఈచ్ అదర్ కపుల్." ఆర్థికంగానూ-సామాజికంగానూ అది చూడచక్కని జంట.

* * *

రవణ ఎందుకో గట్టిగా అరుస్తుంటే తల త్రిప్పి చూసింది సులభ. దాని చిన్న కూతురి

## పరిచయం



కాజులూరు హైస్కూల్లో ఉద్యోగం వుంది. సోషియాలజీలో ఎం. ఏ. డిగ్రీ వుంది.

ప్రోత్సహించడానికి శ్రీవారూ
విమర్శించడానికి ఇద్దరు కొడుకులు
సపోర్టు చెయ్యడానికి ఒక కూతురు
ఆనందించడానికి ఐదుగురు అన్నదమ్ములూ
వున్నారు.

మొదటి కథ "తిక్క కుదిరింది" ఆంధ్ర పత్రిక ప్రచురణ. మొదటి నవల జలతరంగిణికి 1981 ఆంధ్రజ్యోతి దిన పత్రిక నవలల పోటీలో ద్వితీయ బహుమతి లభించింది. అదే పత్రికలో ప్రస్తుతం "శ్రమఏవ జయతే" నవల సీరియల్‌గా వస్తోంది.

ఒక డజను కథలూ, రెండు పుంజీల రేడియో నాటికలూ వెలువడ్డాయి.

స్త్రీ తనక్కావలసిన దేమిటో తెలుసుకొని, దానిని సాధించడం కోసం కృషి చెయ్యగల స్థితిలో వుంటే — సమాజం పెరిగివస్తే. అటువంటి సమాజ వికాసానికి దోహదం చేసే సాహిత్యం సృష్టించగలిగితే జన్మ చరితార్థమే.

ప్రథమ బహుమతి నిచ్చి ప్రోత్సహించిన ఆంధ్రజ్యోతి సంపాదకవర్గానికి నా కృతజ్ఞతలు.

—బండారు లక్ష్మి

కాలు మీద గేద్దూడ గిట్టతో తొక్కేసింది. రక్తాన్ని చూసి ఆపిల్ల గోలపెట్టి ఏడుస్తుంటే— రవణ ఆ దూడ కాలూకు బుద్దాడిసీ, వాడి ఏడుతరాలవాళ్ళనూ కాళ్ళూ-నోళ్ళూ పడిపోమని శాపనార్థాలు పెట్టి తిడుతోంది.

"మీ కన్నూ కాలూపడా- మీ గొడ్డూగోదా నాశనమవ్వా- మిమ్మల్ని గోదాట్లో కలిపెయ్యా— మిమ్మల్ని మోర్రు—"


సులభ ఆశ్చర్యంగా చూస్తోంది రవణని. ఎంత హృదయపూర్వకంగా— ఎంత ధైర్యంగా-తిడుతోందో! అలాగా కోపాన్నీ, బాధనీ అంత బాహాటంగా బయటకు కక్కగలిగే అదృష్టం ఎంతమందికుంటుంది?

తనకు ఎన్నోసార్లు భర్త మీద పీకలవరకూ కోపంవచ్చేది. అతను మిలిటరీలో కెప్టెను. భార్యాపిల్లల్ని తనదగ్గర వుంచుకొనే వాడు కాదు. రెండుమూడునెలలకోసారివచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళిపోయేవాడు. వచ్చినప్పుడు కూడా తనకు పెళ్ళాం అవసరం లేకపోయినా పెళ్ళానికి తనవసరం వుంటుందేమోనన్న ఆలోచన కూడా తనకి వుండేది కాదు. అర్థరాత్రి వరకూ ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేసి, ఏ సోఫాలోనో పడుకొని నిద్రపోయే మొగుణ్ణి చూస్తుంటే పీక నులిమేద్దామన్నంత కోపం వచ్చేది సులభకి. కానీ తను నేర్చుకున్న నాగరికత తనకోపం తన పీకనే నులిమేసేది.

"అమ్మగారూ సీర్లియిగోనండి" నాలుగు వేడి వేడి చీరలు తువాల్లో చుట్టి రెండు చేతులమీదా వేసుకొని భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చి కుర్చీలో పెట్టింది రవణ.

"పిల్ల వూరుకుందా— దెబ్బ గట్టిగా తగిలిందేమో." అడిగింది సులభ రవణని చూస్తో. కచ్చపోసి బిగించిన చీర. దోపుకున్న కొంగు ప్రక్కనుంచి తెల్లగా కనిపిస్తున్న పల్చని పొట్ట— సన్నని చేతులూ— అన్నిటినీ మించిన ఆ కళ్ళు—ఎవరివి చెప్మా—వెడల్పాటి మొహంలో చేపపిల్లల్లాంటి ఆ కళ్ళు- తన గుండె లోతుల్లోకి చూస్తున్న కళ్ళు- ఎవరివై వుంటాయి? తన భర్తవి తేనె రంగు కళ్ళు. ఎప్పుడూ ఎర్రజీరతో సగం మూసుకునే వుంటాయి. అతను వేసిన గుళ్ళే తప్ప — అతని కళ్ళు ఎవరి గుండెల్లోనూ గుచ్చుకోవు. మరయితే ఎవరు?

ఏదో అమూల్యమైన వస్తువు పోయినప్పుడు యిల్లంతా పిచ్చిగా వెతుకుతున్నట్టుగా వుంది ఆమె మనసు. రాత్రి మంచం మీద పడుకున్నా మస్తిష్కం కందిరీగల తుట్టెలా వుంది.




ఎవరు చెప్మా— కాలేజీలో కూడా తనకు ఎక్కువమంది స్నేహితులుండేవారు కాదు. తనే ఎక్కువగా ఎవరితోనూ స్నేహం చేసేది కాదు— స్టేటస్‌కి భంగమని. రెండు కార్లుండడమంటే ఆ రోజుల్లో చాలా గొప్ప. కరెంటు పోయినట్టుంది. ఫ్యాను ఆగిపోయింది. కిటికీ తలుపు బారుగా తెరచింది. ఎవరో ముసిలాడు దగ్గుతూ పోతున్నాడు. కుక్క అరుస్తోంది అతణ్ణి చూసి.

* * *

తనకూ కూడా ఓ తాతయ్య వుండేవాడు. అమ్మ తండ్రి. అతను కూడా అలాగే దగ్గేవాడు. ఆయన ఆస్తంతా కొడుకులు తీసుకొని, కోడళ్ళు హీనంగా చూస్తుంటే అమ్మ దగ్గిరికొచ్చారు.

శీతాకాలం తాతయ్యకు దగ్గు ఎక్కువగా వుంది. నాన్న విసుక్కుంటున్నారు— లేనిపోని తద్దినానికి. అమ్మ సులభని పిలిచింది.

"మధ్యాహ్నం ప్రకృతి ఆశ్రమం నుంచి చందా కొచ్చారు చూడూ— ఆయన తాతయ్యని తీసుకురమ్మన్నారు. కొంచెం నువ్వు తీసికెళ్ళి దిగబెట్టి వస్తావా? నేను మీటింగ్‌కి వెళ్ళాలి." అంది భర్త వినకుండా. వాళ్ళు వెళ్ళిపోయాక—

తాతయ్యని వెనక సీట్లో పడుకోబెట్టించింది. కావాల్సిన సామాన్లన్నీ ఆయా కార్లో పెట్టింది. సులభ ఫ్రంటు సీట్లో కూర్చుంది. డ్రైవర్ కారు నెమ్మదిగా పోనిస్తున్నాడు, కుదుపుల్లేకుండా. సులభకి బోరుగా వుంది. డ్రైవర్ ప్రక్కన ఏదో పుస్తకం వుంది. సులభ పుస్తకం తియ్యబోతుంటే "ఒద్దండీ" అంటూ చేత్తో నొక్కి పట్టాడు డ్రైవర్.

సులభ అతని చేతిని ప్రక్కకు నెట్టి పుస్తకం లాక్కుంది. డోర్ వైపు జరిగి కూర్చుని పేజీ త్రిప్పింది. ఏదో అరవం


## కోటి మంది వచ్చినా

నేటినుండి ఏనాటికి
వీటి తలుపు మూయకు!
కోటిమంది వచ్చినా
చోటున్నది లోన!

ప్రతి రోజూ వత్సరాది!
ప్రతి మనిషీ ప్రేమాతిథి!
చెరగనీకు పెదవులపై
చిరునవ్వుల ఆహ్వానము

ఎంత చిన్నదో లోకం
ఈ హృదయంలో ఇమిడింది
కోటిమంది వచ్చినా
చోటున్నది లోన!

దేవులపల్లి
కృష్ణశాస్త్రి




పుస్తకం. పేజీలు రివ్వున తిప్పింది. ఒక బొమ్మ-ఒక యువతి పాలిస్తోంది. బలమైన వక్షోజాలు— పాలుత్రాగుతున్నది పసిపిల్ల వాడు కాదు. సులభ క్రిందిపెదవిని పంటితో నొక్కి పెట్టింది. డ్రైవర్ వైపు చూసింది. అతడు కళ్ళను రోడ్డుమీదికే కేంద్రీకరించాడు—కాదు నటిస్తున్నాడు. అతని కళ్ళు నల్లటి గోళీల్లా- నవ్వుతున్నాయ్. మెరుస్తున్నాయ్. కవ్విస్తున్నాయ్—కాల్చేస్తున్నాయ్- గుండెల్ని కోసేస్తున్నాయ్.

కారు టౌన్ దాటాక నాలుగు మైళ్ళు ప్రయాణం చేసేక— ఆశ్రమాన్ని ప్రవేశించింది. తిరుగు ప్రయాణంలో ప్రకృతి పురి విప్పింది. సులభ— యింత సులభంగానా అని ఆశ్చర్యపోయాడు డ్రైవర్.

వీలు దొరికినప్పుడల్లా తాతయ్యను చూపి వస్తున్న సులభ మానవత్వానికి సంతోషించింది అమ్మ—బాధ్యత తప్పినందుకు. మునలాయన దినవారాలయ్యాక ఒకరోజు—

"అమ్మా.........?" సులభ అడిగిన ప్రశ్నకు వెంటనే జవాబుచెప్పలేకపోయింది. గతుక్కుమంది. తిరిగి ప్రశ్నే అడిగింది. కూతురికి నాలుగు నెలలు పూర్తయినా గ్రహించలేని తన బాధ్యతా రాహిత్యాన్ని కాసేపు తిట్టుకుంది అమ్మ.

"ఆ రాస్కెల్‌తో ఏమీ చెప్పకు. వాడి పని చెప్తాలే."

ఇంకో రెండు నెలల తర్వాత యింట్లో ముసలి సర్వెంటుతో అతని వూరు పంపించేసింది సులభని.

ఎవరూ ఎక్కువ ప్రశ్నలడగలేదు.

మూడు నెలలు అందరిచేతా సేవలు చేయించుకొన్న తరువాత— చిక్కుడు గింజ మొలకెత్తింది. దాని లేతరెమ్మని చూపించడానికి అనుజ్ఞ లేదు. కాళ్ళకాడ బిడ్డ గుండెలవరకూ రానిస్తే— ఆ మమతని ఎవరాపగలరు!!

తిరిగి వచ్చిన రెండేళ్ళ తర్వాత సులభకు పెళ్ళి చేశారు రెండు మిలట్రీ బ్యాండులు పెట్టి.

* * *

అవును— రవణ కళ్ళు అతనివే— అనుమానం లేదు. ఆరు నెలలపాటు ప్రకృతి ఒడిలో తన స్త్రీత్వానికి సార్థకత నిచ్చిన డ్రైవర్ కళ్ళు.

అయితే ఇదెలా సాధ్యం! ఎక్కడి వల్లూరు? ఎక్కడి కోనసీమ? అప్పుడు తనకు కూతురే పుట్టిందా? పుడితే వీళ్ళింటికెలా వచ్చింది? అలా జరిగి వుండదు. ఒకవేళ ఆ డ్రైవర్ వీళ్ళకు చుట్టమేమో! ఆ పిల్ల అతని కూతురేమో— ఏమో—

రాత్రి చపాతీ తినేసేక బయట పోర్టికోలో వేసిన కుర్చీలో కూర్చుంది సులభ.

రవణ కూతుర్ని తీసుకొని సినిమాకు పోయింది.

పిల్లాణ్ని భుజంమీద వేసుకొని రోడ్డు మీద పచార్లు చేస్తున్నాడు తాతాలు.

"అమ్మగారూ, సోడాగాని ఏవన్నా తెచ్చి పెట్టమంటారేటి" నమ్రతగా అడిగాడు తాతాలు.

"ఏమీ వద్దులేగాని ఏవిటి మీ వూరు రాజకీయాలు" అంది సులభ అతణ్ణి మాటల్లోకి దించుతూ.

తాతాలు కొంచెం దూరంలో నేల మీద కూర్చొని ఆ వూరి వాళ్ళు ఎంత వెధవలో కాసేపు చెప్పి "అందుకే సందమ్మగారూ మా రవణ్ణి గుడ్డల కోసం ఎవురింటికీ పంపను. ఎత్తే నేను- లేకపోతే మా పిల్ల" అన్నాడు.

"అందులోనూ మీ యావిడ మీ కులం మనిషిలా వుండదు. దొరల పిల్లలా వుంటుంది." అంది సులభ వూపిరి బిగబట్టి. తాతాలుని కదిపితే డొంకంతా కదులుతుంది.

"మీరు బాగా కనిపెట్టేరమ్మగారూ. అది మా యింట బుట్టిన పిల్లకాదు. ఆ రోజుల్లో

దివ్య సంగీతం

కోయన్నా
కాకా అన్నా
కొక్కొరో కో అన్నా
ప్రతి పలుకూ
పదుగుర్నీ పిలుస్తోంది
కలబోసుకు తిందామని
కలకాలం మందామని.

—నండివాడ భీమారావు

మా సినప్ప మాచర్లలో వుండేదండి' మా బావ కక్కడ వుజ్జోగం. మాయప్పకి సుస్తీగా వుందిరమ్మంటే మా— మా పెద్దప్ప— అదే ఈ రవణ తల్లి— ఎల్లిందండి. అది తిరిగొచ్చీటప్పుడు ఈ పిల్లని ఆస్పటాల్లో దబ్బులిచ్చి తెచ్చుకుందండి. ఎవరో గొప్పింటోరి పిల్లే— నా పెళ్ళవయి రాసి పెట్టిందండి" గర్వంగా అన్నాడు తాతాలు. సులభ కా తరువాత మాటలేవీ వినిపించలేదు.

రెండు పెద్ద పెద్ద నీటి బిందువులు సులభ కళ్ళల్లో నించి జారిపడ్డాయి. ఒక బిందువు కాలుతున్న పెనం మీద పడింది. ఇంకొకటి శుక్తిలో పడి ముక్తా ఫలమయింది. రెండూ నా కళ్ళ నుంచి జారినవే అనుకుంది సులభ.

మంచం మీద పడుకొని చాలా కన్నీరు ఖర్చుచేసిన తరువాత సులభ ఆలోచించింది. రవణకు సహాయం చెయ్యాలి! ఈ మురికి బట్టల బ్రతుకునుంచి దానిని తప్పించాలి. ఎలా? తన దగ్గర పాతిక కాసుల పలక సరులున్నయ్. ఏదైనా షాపు పెటుకోమని ఇచ్చేస్తే— లేకపోతే నాలుగెకరాల భూమి కొనిపించితే— ఏదో ఒకటి చెయ్యాలి— అందుకే ఏదో ఋణానుబంధం ఇలాగ కలిపింది. పగలంతా అలాగే గడిపింది సులభ.

ఆ రోజు సాయంత్రం శంకర్ వచ్చాడు కార్లో. "శలపలు నెల రోజులు స్విట్జర్లాండులో గడపడానికి ఏర్పాట్లు జరిగాయి. ఎల్లుండి ప్రయాణం. ఇక్కణ్ణుంచి రేపు ఉదయం బయల్దేరదాం" అన్నాడు శంకర్. కాసేపు కబుర్లాడేక సులభ గదిలోకి వచ్చి పడుకుంది. తను వెళ్ళిపోతోంది. మళ్ళీ ఈ ప్రాంతాలకు బహుశా యిక రాదు. మరి రవణకు చెయ్యాలనుకున్న సహాయం?

రవణ వాళ్ళ పిల్లకాదని అందరికీ తెలుసు. యిప్పుడు తనేమైనా యిస్తే అందరూ అనుమానం పడరూ! శంకర్ ఏమనుకుంటాడు? అయినా యిప్పుడు మాత్రం రవణకేం తక్కువ? నిండుగా ప్రేమించే మొగుడు,ముత్యాల్లాంటి పిల్లలు- ఎయిర్ కండిషన్‌లాంటి చక్కటి గాలి- కంటికి నచ్చిన బట్టలు-ఒంటికి సరిపడా పని- కావలసినంత ఆకలి - ఆరోగ్యం—మనిషికి అంతకంటే ఏం కావాలి. స్వచ్ఛంగా కూడా తృప్తిగా జీవిస్తోంది నిజం చెప్పాలంటే. ఇప్పుడు తనేదో సహాయం చేస్తే — నీటిలో చేపని తీసి శీతల గిడ్డంగిలో భద్రపరిచినట్టుంటుంది— అందుచేత వూరుకోడమే చాలా మంచిపని. అని నిర్ణయించుకొన్నాక నిశ్చింతగా పడుకుంది సులభ.

ఉదయం పనిమనిషి కార్లో సామాను పెడుతుంటే గబగబా వచ్చింది రవణ. తయారుగా వున్న సులభని చూసి-"అమ్మగారూ మీరూ ఎల్లిపోతారా" అంది గాభరాగా. తల వూపింది సులభ దానివైపు ఆత్మీయంగా చూస్తూ. అప్పటికే శంకర్ కార్లో కూర్చున్నాడు.

"పిల్లాడికి చొక్కా కుట్టించు" వాడి చేతిలో పెట్టిన వందనోటు చూసుకోనేలేదు రవణ. "అమ్మో కోకలు. నిన్నేసిన నాలుగు కోకలూ నాకాడే వుండిపోయాయి. మాసిని య్యట్టుకొచ్చేత్తాను. అక్కడుతికించుకుందురుగాని" అంటూ పరుగు తీసింది.

సులభ గబగబా బయటికి వచ్చి కారెక్కి— "పోనియ్" అంది క్షణం ఆలస్యం చేస్తే కూతురికి ఆ చీరలు కూడా దక్కవన్న భయంతో.

చీరలు పట్టుకొని గబగబా వచ్చిన రవణ, వెళ్ళిపోతున్న కారువైపు. చేతిలో వున్న చీరలవైపూ చూస్తూ అలాగే నిలబడి పోయింది నోట్లో పడుతున్న దుమ్మని పట్టించుకోకుండా—

# ఆంధ్రజ్యోతి

సచిత్ర వార పత్రిక

## 1983 రుధిరోద్గారి ఉగాది కథల పోటీలో

## సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథల జాబితా

1. చదువుకున్నవాడికన్న సైకిల్ మేలు —'జ్యేష్ఠ', విశాఖపట్నం
2. నిన్ను నువ్వే —శ్రీ వి. రాజారామమోహనరావు, హైదరాబాద్
3. బ్రహ్మాస్త్రం —'వసుంధర'. భువనేశ్వర్
4. చలిలో సూర్యుడు —'విహారి', కడప
5. ఓ యింటి రామాయణం —శ్రీ యర్రంశెట్టి శాయి, సికింద్రాబాద్
6. రాక్షస న్యాయం —'మిర్రర్', హైదరాబాద్
7. గంధర్వుల వైద్యం —శ్రీమతి జె వి. సుబ్బలక్ష్మి. హైదరాబాద్
8. మనిషిలోని మనిషి —శ్రీ వి. మోహన్‌కుమార్. హైదరాబాద్
9. మధ్యముడు —శ్రీ కవనశర్మ. బెంగుళూరు
10. విలాపాగ్నులు —శ్రీ తాడిగిరి పోతరాజు, పొత్తులనడుమ
11. తొలకరి —శ్రీ ఎన్. తారకరామారావు, విజయవాడ
12. కుంజికుట్టన్ —శ్రీ అవధానుల జగన్నాథరావు.
శ్రీ మల్లంపల్లి గాంధి రామారావు, నాగపూర్
13. వెలి —శ్రీమతి చల్లా శేషవేణి, రాజమండ్రి
14. ఎస్కలేటర్ —శ్రీమతి 'మీలా', హైదరాబాద్
15. ఆసరా —శ్రీ వారణాసి ప్రసాదరావు, విజయనగరం
16. అడవి (2) —శ్రీ మైనంపాటి భాస్కర్, సికింద్రాబాద్
17. జ్ఞానోదయం —శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి. ఏలూరు
18. ఆ రోజెప్పుడు —డాక్టర్ జయప్రద, నెల్లూరు
19. కొలాప్స్ శ్రీ గంగుల నరసింహారెడ్డి, వొరబాల
20. ప్రయాణం —శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి, ధవళేశ్వరం

ఈ సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలను, మా పత్రికకు మామూలుగా వచ్చు (అంగీకరించిన) కథలతో కలిపి రచయిత(త్రు)లకు అసౌకర్యం కలగకుండా ప్రచురిస్తామని మనవి.

—ఎడిటర్